కవిత

# కేవలం స్వాగతం

నీ కిరణ లేశమే సోకదా నా కింక
ఈ పేద బ్రతుకునకు తోపదా ఆశ

జలద సంకులములో
భయద కాననములో
కటిక చీకటులలో
కన్నీటి ధారలో

ఎవరు వింటారోయి నా హృదయగీతి
ఎవరు కంటారోయి నా క్షుభితమూర్తి

బరువైన గుండెలో
భయము తోచిన వేళ
శిథిలమై నా మేను
చిదికి పోయిన వేళ

ఆ మబ్బు కన్నెలకీ ఆరాట మేలొకో
ఆకాశమున కింత ఆనంద మెందుకో

తుదిలేని ఈ రేయి
ఎదలోని కోరికలు
మసలుకొను ఈ రేయి
ముసురుకొను ఈ వేళ

ఎచటి కేగుదునోయి ఈ రేయి నేనింక
ఎటుల సాగుదునోయి ఈ కారుచీకటుల

పి. శ్రీదేవి